సాక్షి
జనగామ


శనివారం । 22 । మార్చి । 2025



ఒకే దేశం, ఒకే ఎన్నిక నష్టమే...

సమాజానికి 'ఒకే దేశం- ఒకే ఎన్నిక' నష్టదాయకమని ప్రముఖ సామాజిక వేత్త, రిటైర్డ్ ప్రొఫెసర్ హరగోపాల్ అభిప్రాయపడ్డారు.

- 8లో▸



వంటల్లో నూనె తగ్గించండి

పిల్లల్లో ఊబకాయం వస్తున్న నేపథ్యంలో పాఠశాలల మధ్యాహ్న భోజనంలో నూనె తగ్గించాలని ఆదేశాలొచ్చాయి.

- 8లో▸

గరిష్టం/కనిష్టం 36°/23°

వాతావరణం

జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతం అవుతుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

e టిమ్స్‌తో జీగా..

ఆర్టీసీలో డిజిటల్ చెల్లింపులతో టికెట్ల జారీ

- ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటున్న సంస్థ
- వరంగల్ రీజియన్‌కు చేరుకున్న 750 ఇ-టిమ్స్
- టికెట్ జారీపై మరింత స్పష్టత
- ప్రతి స్టేజీ వారీగా వివరాలు తెలుసుకునే సౌకర్యం

టిమ్‌పై క్యూఆర్ కోడ్

ప్రయాణికులు తమ వెంట నగదు లేకున్నా డిజిటల్ పేమెంట్స్ ద్వారా టికెట్ పొందే సౌకర్యం కలగనుంది. చిల్లర సమస్యకు తెర పడనుంది. టిమ్‌పై క్యూఆర్ కోడ్ ఉంటుంది. దాన్ని స్కాన్ చేయడం ద్వారా చెల్లింపులు చేసి టికెట్ పొందవచ్చు.

హన్మకొండ: ప్రయాణికులకు మెరుగైన, నాణ్యమైన సేవలందించేందుకు ఆర్టీసీ ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకుంటోంది. ప్రయాణికులకు సౌకర్యవంతంగా టికెట్ జారీకి ఇ-టిమ్స్‌ను ప్రవేశ పెట్టింది. దీనిలో భాగంగా ఆర్టీసీ వరంగల్ రీజియన్‌లోని ఆర్టీసీ బస్సుల్లో నగదు రహిత సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈమేరకు కండక్టర్లు, డ్రైవర్లకు శిక్షణ ఇస్తూ క్రమంగా ఇ-టిమ్స్‌ను ప్రవేశపెడుతున్నారు. ఇప్పటివరకు ఉపయోగించిన టిమ్స్‌తో చూసుకుంటే మరిన్ని ఫీచర్లతో వీటిని రూపొందించారు.

మరికొన్ని అవసరమే..

వరంగల్ రీజియన్‌లో ప్రతిరోజూ 936 బస్సులు వివిధ రూట్లలో తిరుగుతుంటాయి. 3.76 లక్షల కిలోమీటర్లు తిరిగి సగటున రోజుకు రూ.2.20 కోట్ల ఆదాయాన్ని సంస్థ రాబట్టుకుంటుంది. 936 బస్సులకుగాను ప్రస్తుతం 750 ఇ-టిమ్స్ మాత్రమే చేరుకున్నాయి. అన్ని బస్సుల్లో అమలుచేయాలంటే మరో 186 అవసరం. ఎప్పుడైనా టిమ్ మొరాయిస్తే బాగు చేసే వరకు వినియోగించుకునేలా అదనంగా మరికొన్ని అవసరం.



ప్రతీది ఆన్‌లైనే..

స్టేజీల వారీగా ఎన్ని టికెట్లు జారీ అవుతున్నాయి.. ఇందులో డిజిటల్ పేమెంట్స్ ద్వారా ఎన్ని, నగదు రూపేణా ఎన్ని, జీరో టికెట్లు ఎన్ని జారీ అయ్యాయో తెలుసుకునే సౌకర్యం ఉంది.

- ఆర్టీసీ డిపోలు, వరంగల్ రీజియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డ్యాష్ బోర్డు ద్వారా ప్రతీబస్‌లో జారీ అవుతున్న టికెట్ల వివరాలు స్టేజీల వారీగా అధికారులు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.
- ఈ టిమ్స్ పూర్తిస్థాయిలో పని చేయడానికి మరికొంత సమయం పట్టనుంది.
- ముందుగా ఆన్‌లైన్ ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టం (ఓపీఆర్ఎస్) వర్తింపజేస్తున్న బస్సుల్లో వీటిని వినియోగించనున్నారు.
- కండక్టర్లు, డ్రైవర్లకు శిక్షణ ఇచ్చిన తర్వాత పల్లె వెలుగు బస్సుల వరకు క్రమంగా అమలు చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.



ఆధునిక సాంకేతిక పద్ధతులతో ఇ-టిమ్స్

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఇ-టిమ్స్‌ను రూపొందించారు. ప్రస్తుతం రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తున్న బస్సుల్లో మాత్రమే వీటిని వినియోగిస్తున్నాం. క్రమంగా పల్లె వెలుగు వరకు అమలు చేస్తాం. వీటి ద్వారా ప్రయాణికులకు సులువుగా టికెట్ జారీ చేయవచ్చు.

- డి.విజయ భాను, ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం



ఇ-టిమ్ డిజిటల్ పేమెంట్ ద్వారా టికెట్ జారీ

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శని 6:33	ఆది 4:56

ఆస్పత్రుల్లో ఎన్‌క్వాస్

ఆరోగ్య సంరక్షణ.. వైద్యసేవల పరిశీలన

- నాణ్యతా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి
- అర్హత సాధిస్తే మూడేళ్ల పాటు నిధులు
- 4 పీహెచ్‌సీలు.. 8 సబ్‌సెంటర్ల ఎంపిక



జనగామ: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు ఆరోగ్య సంరక్షణ సేవల నాణ్యతను మెరుగు పరిచేందుకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ మంత్రిత్వ శాఖ నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్(ఎన్‌క్యూఏఎస్) అమలు చేస్తోంది. మెటర్నిటీ, జిల్లా ఆస్పత్రులు, సీహెచ్‌సీ, పీహెచ్‌సీ, సబ్‌సెంటర్ల పరిధిలో నాణ్యమైన సేవలకు గాను 'ఎన్‌క్వాస్' అర్హత సర్టిఫికెట్ జారీ చేస్తారు. అర్హత సాధించిన తర్వాత మూడేళ్ల పాటు ఆస్పత్రులకు కేటగిరీల వారీగా కేంద్రం నిధులు ఇస్తుంది. 2024-25, 26, 27 సంవత్సరాలకు గాను మొదటి విడతలో జిల్లాలోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీలను ఎంపిక చేశారు. దేవరుప్పుల మండలం చిన్నమడూరు సబ్‌సెంటర్ సేవలకు సంబంధించి ఎన్‌క్వాస్ బృందం ఆన్‌లైన్‌లో వివరాలను సేకరించింది.

'ఎన్‌క్వాస్' పరిశీలించే కేటగిరీలు

- ఆస్పత్రిలో తగిన మౌలిక సదుపాయాలు, శుభ్రమైన వాతావరణం, అవసరమైన వైద్య పరికరాల నిర్ధారణ
- అడ్మిషన్ నుంచి డిశ్చార్జ్ వరకు రోగి సంరక్షణ, వైద్య సేవల నాణ్యత, పర్యవేక్షణ
- ఆస్పత్రిలో సంక్రమించే ఇన్ఫెక్షన్లను నివారించడానికి ప్రొటోకాల్ అమలు
- ఆరోగ్య సంరక్షణ సిబ్బందికి క్రమంతప్పకుండా శిక్షణ, మూల్యాంకనం
- రోగి రికార్డుల నిర్వహణ
- పేషెంట్ల పట్ల గౌరవ మర్యాదలు

4 పీహెచ్‌సీలు.. 8 సబ్‌సెంటర్ల ఎంపిక

జిల్లాలో 16 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 104 సబ్ సెంటర్లు, 62 పల్లె దవాఖానలు, ఒక బస్తీ దవాఖాన, 4 సీహెచ్‌సీలు, ఒక జిల్లా ఆస్పత్రి, ఒక ఎంసీహెచ్ ఉన్నాయి. కాగా పీహెచ్‌సీల పరిధిలో 20 స్టాఫ్‌నర్సు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ కోసం జిల్లాలోని 4 పీహెచ్‌సీలు, 8 సబ్ సెంటర్లను ఎంపిక చేశారు. ఇందులో ఇప్పగూడెం, తాటికొండ, ఓబుల్‌కేశ్వాపూర్, కొడకండ్ల పీహెచ్‌సీలు, చిన్నమడూరు, ఆలీంపూర్, గూడూరు, సిద్దెంకి, వడ్లకొండ, కుందారం, కోమటిగూడెం, ఉప్పుగల్లు సబ్ సెంటర్లు ఉన్నాయి.



నిర్వహణ అంశాలు

ఆస్పత్రిలో ఆరోగ్య సంరక్షణ, నాణ్యతా ప్రమాణాలు, మౌలిక వసతులు, సిబ్బంది పనితీరు, రోగి సంరక్షణ, ఆస్పత్రి నిర్వహణ, ఇన్ఫెక్షన్స్ నియంత్రణ, మార్గదర్శకాలను పాటించడం, అత్యవసర సేవలు, ఖచ్చితమైన రోగ నిర్ధారణ, శస్త్ర చికిత్స విధానంలో భద్రత, నైపుణ్యం, సమర్థవంతంగా ఫార్మసీ నిర్వహణ, పరిశుభ్రమైన శానిటేషన్, సపోర్ట్ సర్వీసెస్, క్లినికల్ కేర్, ఓపీ సేవలు, వైద్య పరికరాల నిర్వహణ తదితరాలకు సంబంధించి నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ నిబంధనల ప్రకారం మెయింటెన్ చేయాల్సి ఉంటుంది.

అర్హత అనంతరం నిధులు ఇలా..

ఎన్‌క్వాస్‌కు అర్హత సాధించిన సబ్ సెంటర్లకు మూడేళ్ల పాటు ఏడాదికి రూ.50 వేల చొప్పున కేంద్రం బడ్జెట్ రిలీజ్ చేస్తుంది. గత ఏడాది ఉప్పుగల్, మల్కాపూర్, రఘునాథపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్, లింగాలఘణపురం, దేవరుప్పుల పీహెచ్‌సీలు ఎన్‌క్వాస్‌కు ఎంపిక కాగా.. ఏడాదికి ఒకసారి నిధులు వస్తున్నాయి.

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పరిశీలన..



జిల్లాలో ఎన్‌క్వాస్ కోసం 4 పీహెచ్‌సీలు, 8 సబ్ సెంటర్లు ఎంపిక చేశాం. మొదటి విడతలో దేవరుప్పుల మండలం చిన్నమడూరు సబ్‌సెంటర్‌లో రోగులకు అందజేస్తున్న సేవలను ఎన్‌క్వాస్ బృందం ఆన్‌లైన్ ద్వారా తెలుసుకుంది. గుర్తించిన సబ్ సెంటర్లను విడతల వారీగా ఆన్‌లైన్ ద్వారా పరిశీలిస్తారు. పీహెచ్‌సీలను మాత్రం నేరుగా సందర్శిస్తున్నారు.

- మల్లికార్జున్‌రావు, జిల్లా వైద్యాధికారి

జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు



99.90 శాతం హాజరు

- పదో తరగతి పరీక్షలు ప్రారంభం
- ఆరుగురు విద్యార్థుల గైర్హాజరు
- సెంటర్లను తనిఖీ చేసిన కలెక్టర్

జనగామ రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు సెంటర్లకు ఉదయం 8.30 గంటలకే చేరుకున్నారు. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల పరిధి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 41 సెంటర్లు ఏర్పాటు చేయగా.. ఉదయం 9.30 నుంచి 12.30 వరకు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 5 నిమిషాల నిబంధన అమలు చేయడంతో సమస్యలు తలెత్తలేదు. ఎగ్జామ్ సెంటర్లలో విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా డీసీపీ రాజమహేంద్రనాయక్ ఆధ్వర్యాన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మొదటిరోజు 6,221 మంది విద్యార్థులకు గాను 6,215 మంది పరీక్ష రాశారు. ప్రైవేట్‌లో ఒకసారి ఫెయిల్ అయిన విద్యార్థులు ఇద్దరు హాజరయ్యారు. కలెక్టర్ రిజ్వాన్ బాషా నెల్లుట్ల, లింగాలఘణపురం సెంటర్లను, రాష్ట్ర పరిశీలకులు ఎస్.శ్రీనివాసాచారి బచ్చన్నపేట, నర్మెట, డీఈఓ ఎం.రమేశ్ లింగాలఘణపురం సాంఘిక సంక్షేమ పాఠశాల సెంటర్‌ను సందర్శించారు.



లింగాలఘణపురం మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

సమస్యల పరిష్కారమే ధ్యేయం

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి

జనగామ రూరల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయమని నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ శాసన మండలి సభ్యుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో ఎస్ఆర్ గార్డెన్‌లో పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యాన అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మొదట నెహ్రూ పార్కు నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. నిలిచి పోయిన ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీల పునరుద్ధరణ, అందరికీ నగదు రహిత ఆరోగ్య కార్డులు అందించడమే లక్ష్యమన్నారు. అందరికీ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘం అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి, నాయకుడు నూకల ఎల్లారెడ్డి, వివిధ సంఘాల జిల్లాల బాధ్యులు మిర్యాల సతీష్‌రెడ్డి, మంద తిరుపతిరెడ్డి, శ్రీహరి, రవీందర్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గంగిశెట్టి మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

న్యూస్‌రీల్

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

జనగామ రూరల్: ఈ-కుబేర్‌లో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల అన్ని రకాల బిల్లులు ఈనెల 31లోగా చెల్లించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల పరిస్థితి దయనీయంగా మారిందని, పిల్లల చదువులు, వైద్యం తదితర అవసరాలకు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. గతంలో అన్ని రకాల బిల్లులు వారం రోజుల లోపు చెల్లించే వారని, ఇప్పుడు సంవత్సరాలు గడిచినా చెల్లింపులు జరగడం లేదని ఒక ప్రకటనలో విమర్శించారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

జనగామ రూరల్: ఆర్టీసీ జనగామ డిపోలో శనివారం 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ స్వాతి ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని బచ్చన్నపేట, దేవరుప్పుల, లింగాలఘణపురం, నర్మెట, తరిగొప్పుల, రఘునాథపల్లి, మద్దూర్, పాలకుర్తి మండలాల గ్రామాల ప్రజలు ఆర్టీసీ బస్సు సర్వీస్ సేవలకు సంబంధించి సమస్యలతో పాటుగా సూచనలు సలహాలను ఉదయం 11.00 నుంచి 12.00 గంటల వరకు 9959226050 నంబర్‌లో తెలియజేయాలని సూచించారు.


బచ్చన్నపేటలో వర్షం

జనగామ: కొద్ది రోజులుగా మండుతున్న ఎండలతో అల్లాడి పోతున్న ప్రజలకు చల్లని వర్షం కాసింత ఉపశమనం కలిగించింది. శుక్రవారం రాత్రి మండలంలో అరగంట పాటు కురిసిన వానతో వాతావరణం చల్లబడింది. ఎండుతున్న వరి పంటకు స్వల్పంగా ఊపిరి పోసినట్లయింది. మరో రెండు రోజులపాటు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో పొట్టదశలో ఉన్న వరి గింజలు రాలిపోతాయని ఓ పక్క రైతులు ఆందోళన చెందుతుండగా.. నీటి తడి అవసరమయ్యే పంటలకు కొంత మేలు జరుగుతుందని మరికొంతమంది భావిస్తున్నారు.

'యువ వికాస' పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

జనగామ రూరల్: రాజీవ్ యువ వికాసం పథకానికి నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమాధికారి రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. వెనుకబడిన తరగతుల కులాలకు చెందిన నిరుద్యోగ యువత స్వయం ఉపాధికి ఈ పథకం ఉపయోగపడుతుందని, అర్హత, ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్‌లో obmms పోర్టల్ ద్వారా ఏప్రిల్ 5వ తేదీలోగా నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు కలెక్టరేట్‌లోని కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సోమేశ్వరాలయ హుండీ ఆదాయం రూ.14,79,121



పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.14,79,121 వచ్చినట్లు ఈఓ మోహన్‌బాబు తెలిపారు. ఈ ఏడాది జనవరి 18 నుంచి ఈనెల 21 వరకు భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను శుక్రవారం ఆలయ కల్యాణ మండపంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ భువనగిరి ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి పర్యవేక్షణలో లెక్కించారు.

సాగునీరు అందించాలని రైతుల ఆందోళన

బచ్చన్నపేట : నీరు లేక వరి పొలాలు ఎండిపోతున్నాయి.. సాగునీరు అందించి పంటలు కాపాడాలని డిమాండ్ చేస్తూ మండలంలోని వంగ సుదర్శన్‌రెడ్డి నగర్ గ్రామం వద్ద జనగామ- సిద్దిపేట రహదారిపై కట్కూర్, వీఎస్ఆర్‌నగర్ గ్రామాల రైతులు శుక్రవారం ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ గత ఏడాది మాదిరిగా గోదావరి జలాలు వస్తాయని ఆశించి పంటలు సాగు చేయగా.. నీరు రాక 45 శాతం వరకు వరి పొలాలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండిన పంటలను వ్యవసాయ అధికారులతో సర్వే చేయించి ఎకరాకు రూ. 50వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచ్‌లు కోనేటి స్వామి, మూసిని సునీత, నాయకులు ఓరుగంటి శ్రీనివాస్, ఎల్లయ్య, రాజు, శ్రీశైలం, గొడుగు శ్రీనివాస్, బుల్లి అయిలయ్య, యాదయ్య, రవి, మహేష్, బాల్‌నర్సయ్య, సిద్ధిరాజయ్య, సాయిలు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



జనగామ- సిద్దిపేట రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేస్తున్న రైతులు

ప్రాధాన్యత రంగాలకు రుణాలివ్వాలి

- కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: ప్రాధాన్యత కలిగిన రంగాలకు అధిక మొత్తంలో రుణాలు మంజూరు చేసి జిల్లా అభివృద్ధికి తోడ్పాటు నందించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో డీసీసీ, డీఎల్ఆర్సీ బ్యాంకర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ రుణాలపై సమీక్షించారు. వార్షిక ప్రణాళికకు సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరం లక్ష్యం రూ.4569.48 కోట్లు కాగా మూడో త్రైమాసికానికి రూ.3040.59 కోట్లు(66.54 శాతం) పూర్తి చేశామని, వ్యవసాయానికి 70.89 శాతం, దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలకు 71.35 శాతం, ప్రాధాన్యత రంగాలకు 59.31 శాతం రుణాలు ఇచ్చినట్లు బ్యాంకర్లు తెలిపారు. ఈ ఏడాది లక్ష్యం రూ.4045.72 కోట్లకు రూ.2399.62కోట్లు ప్రాధాన్యత రంగాలకు మంజూరు చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ రుణాలపై విస్తృత ప్రచారం చేపట్టాలని, మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ వ్యాపార విస్తరణ, కొత్త ఎంటర్ ప్రైజెస్‌ల ఏర్పాటుకు రుణాలు ఇవ్వడానికి మేళాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. వీధి వ్యాపారులకు విరివిగా ముద్ర రుణాలతో పాటు స్టాండ్ అప్ ఇండియా కింద రుణాలు అందించాలన్నారు. అనంతరం నాబార్డు 2025-26 పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో ఆర్బీఐ, నాబార్డ్ ఏజీఎంలు శ్రావ్య, చంద్రశేఖర్, ఎల్డీఎం శ్రీధర్, ఏఓ రామారావునాయక్, వివిధ శాఖల అధికారులు, బ్యాంకుల కంట్రోలర్లు, మేనేజర్‌లు పాల్గొన్నారు.



క్రెడిట్ ప్లాన్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, బ్యాంకర్లు


ఎల్ఆర్ఎస్ ప్రక్రియ వేగవంతం

జనగామ: జిల్లాలో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ వేగంగా జరుగుతోందని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. పురపాలక ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ శుక్రవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఈనెల 31వ తేదీ వరకు రుసుము చెల్లించి 25 శాతం రాయితీ పొందడానికి చొరవ చూపుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 2,415 మంది దరఖాస్తు చేసుకోగా ఒకేరోజు 200 ప్రొసీడింగ్ కాపీలు అందజేసినట్లు చెప్పారు. మిగతా దరఖాస్తుల వెరిఫికేషన్ త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. సందేహాల నివృత్తికి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సహాయకేంద్రం- 9948187334, పురపాలక సహాయ కేంద్రం -8978207205 నంబర్లలో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

జిల్లాకు పాపన్న పేరు పెట్టాలి

- గౌడ సంఘాల నాయకులు

జనగామ: జిల్లాకు పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని తెలంగాణ గౌడ సంఘాల సమన్వయ వేదిక నాయకులు అంబాల నారాయణగౌడ్, వంగ సదానందంగౌడ్, పంజాల జైహింద్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో వేదిక సమన్వయకర్త కన్న పరశురాములు గౌడ్ అధ్యక్షతన హైదరాబాద్, నిర్మల్, ఆదిలాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాల, సిద్దిపేట, యాదాద్రి, వరంగల్, హనుమకొండ, సూర్యాపేట, నల్లగొండ, రంగారెడ్డి, మెదక్ జిల్లాల గౌడ సంఘాల వేదిక ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలో వారు మాట్లాడారు. అంతకు ముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీగా తరలివచ్చారు. బహుజన కులాల నాయకులు సంఘీభావం ప్రకటించారు. చీపురు మల్లేశ్ యాదవ్, చల్లా సుధీర్‌రెడ్డి, అంకెనపల్లి వేంకటేశ్వర్లు, సానాడి రాజు, గిద్ద రాంనర్సయ్య, గొలుసుల దుర్గాచలం, బొమ్మెణ రాజుగౌడ్, మిట్టపల్లి విజయ్‌కుమార్‌గౌడ్, యాదగిరి, నామాల శ్రీనివాసు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అంజనేయులు గౌడ్

పేరు మార్చితే మరో పోరాటం

- జిల్లా జేఏసీ కన్వీనర్ రాజు

జనగామ: జనగామ పేరు మార్చితే మరో పోరాటం తప్పదని జిల్లా జేఏసీ కన్వీనర్ మంగళ్లపల్లి రాజు హెచ్చరించారు. శుక్రవారం ఆర్టీసీ చౌరస్తాలోని ఉద్యమ స్ఫూర్తి(జైన) స్తూపానికి జేఏసీ ఆధ్వర్యాన పాలాభిషేకం చేశారు. అనంతరం రాజు మాట్లాడుతూ పేరు మార్చడమంటే ఇక్కడి మహనీయులను అవమానించడమే అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీనారాయణనాయక్, మల్లిగారి రాజు, గండి నాగరాజు, ఆకుల సతీష్, పిట్టల సురేష్, గంగా భవాని, మీసాల వెంకన్న, గన్ను కార్తీక్, ఆసర్ల సుభాష్, నర్ర నవీన్, తిరుమల్‌రెడ్డి, ప్రణీత్ రెడ్డి, నల్ల రాహుల్, మద్దెల కార్తీక్, అజయ్, ఇమ్రాన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న జేఏసీ బాధ్యులు

ప్రైవేట్ అప్పులు తీర్చేందుకు అదనపు రుణాలు



వ్యవసాయాధికారులు, రైతులతో డీఎల్ఎస్ఏ కార్యదర్శులు

వరంగల్ లీగల్ : రైతుల ప్రైవేట్ అప్పులు తీర్చుకోవడానికి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం బ్యాంకుల నుంచి పంట రుణాలకు అదనంగా దీర్ఘకాలిక రుణాలు పొందేందుకు రైతులు దరఖాస్తులు చేసుకోవాలని హనుమకొండ, వరంగల్ జిల్లాల న్యాయసేవాధికార సంస్థల కార్యదర్శులు జడ్జి క్షమాదేశ్ పాండే, ఎం.సాయికుమార్ సూచించారు. శుక్రవారం తెలంగాణ రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు అధ్యక్షతన జిల్లా కోర్టు ఆవరణలో బ్యాంకర్లు, రెవెన్యూ అధికారులు, వ్యవసాయాధికారులు, రైతులతో హనుమకొండ, వరంగల్ న్యాయసేవాధికారి కార్యదర్శులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ.. జిల్లా న్యాయసేవాధికార సంస్థల కార్యదర్శుల సూచన మేరకు అర్హులైన రైతులందరికీ ప్రైవేట్ అప్పులు తీర్చుకోవడానికి అదనపు రుణాలు మంజూరు చేసేందుకు బ్యాంకర్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. సమావేశంలో తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కిషన్‌రావు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్, తిరుపతి, రాజు, బాపురావు, సీఐఎస్ఎఫ్ కోఆర్డినేటర్ తోకల్ ఆదిరెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి రవికుమార్, బ్యాంకర్లు, వ్యవసాధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ల పరీక్షలు నిర్వహించలేం

- కేయూ రిజిస్ట్రార్‌కు ప్రైవేట్ యాజమాన్యాల వినతి



వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ బాధ్యులు

కేయూ క్యాంపస్: 'కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం విడుదల చేయడం లేదు.. దీంతో ఆర్థికపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నాం.. అందుకే రాబోయే రోజుల్లో యూనివర్సిటీ డిగ్రీ కోర్సుల 2,4,6 సెమిస్టర్‌ల పరీక్షలు నిర్వహించలేం' అని ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ బాధ్యులు స్పష్టం చేశారు. ఈమేరకు శుక్రవారం రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రాన్ని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రావు మాట్లాడుతూ గత 20 నెలలకు సంబంధించిన ఫీజులు చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులకు గురవుతున్నాయన్నారు. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయొద్దని, ఆర్‌టీఎఫ్ ద్వారా ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పడంతో నిరీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. కొన్ని యాజమాన్యాలు అప్పులు చేసి కళాశాలలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కళాశాలలు నిర్వహించే పరిస్థితి లేదని, ఈనెల 25 వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సుమారు రూ.2,500 కోట్లు చెల్లించని పక్షంలో ఏప్రిల్‌లో డిగ్రీకోర్సుల 2,4,6 సెమిస్టర్ల పరీక్షల నిర్వహణ సాధ్యం కాదని స్పష్టం చేశారు. రిజిస్ట్రార్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ కేయూ అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శి జి.వేణుమాధవ్, ఇతర బాధ్యులు ఉన్నారు.

బడుగుల పైకి దూసుకొచ్చిన లారీ

అప్రమత్తమైన ఆటోడ్రైవర్ | రోడ్డుపక్కనే గుంతలోకి దూసుకెళ్లిన ఆటో | ఒకరి మృతి, తొమ్మిది మందికి గాయాలు

వాళ్లందరు రోజువారీ కూలీలు.. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి.. స్వగ్రామంలో పనిదొరక్క.. పనిని వెతుక్కుంటూ.. ప్రతీ రోజు యాభై కిలోమీటర్లు ఆటోలో వెళ్లి పనిచేసి తిరిగి ఇంటికొస్తారు.. రోజువారీ మాదిరిగానే.. శుక్రవారం కోడికూత వేళకు లేచి మధ్యాహ్నానికి సద్దిమూట పెట్టుకొని కూలీకోసం ఆటోలో బయల్దేరారు. ఈక్రమంలో మూలమలుపు వద్ద లారీ.. వీరి ఆటోమీదకు దూసుకొచ్చింది. దీంతో డ్రైవర్ రోడ్డు పక్కనే ఉన్న చెట్ల పొదల్లోకి ఆటోని తిప్పాడు.. రోడ్డుపక్కనే వేసిన సిమెంట్ దిమ్మెకు తాకి ఆటో బోల్తా పడడంతో ఒకరు మృతి చెందగా తొమ్మిది మంది తీవ్రంగా గాయపడ్డారు.

– నర్సింహులపేట



మహబూబాబాద్ జిల్లా జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



ప్రమాదంలో ముళ్ల పొదల్లోకి వెళ్లిన ఆటో

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని చెర్లపాలెంకు చెందిన ఆటోలో అదే గ్రామానికి చెందిన 14 మంది, పక్కనే ఉన్న ఫత్తేపురానికి చెందిన ముగ్గురు.. మొత్తం 17 మంది కూలీలు మిరపతోటలను ఏరడానికి శుక్రవారం ఉదయం మరిపెడ మీదుగా ఖమ్మం జిల్లాలోని తిరుమలాయపాలెం మండలానికి ఆటోలో బయల్దేరారు. ఈక్రమంలో పెద్దనాగారం స్టేజీ సమీపంలోని ఇటుక బట్టీల సమీపంలో మరిపెడ వైపునకు వెళ్తున్న ఆటోను వెనుక నుంచి లారీ అతివేగంతో వస్తూ ఢీ కొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న దర్మారపు సోమక్క, దర్మారపు సునీత, దర్మారపు ఉప్పలమ్మ, గూడెల్లి దుర్గ, గూడెల్లి అరుణ, డ్రైవర్ దర్మారపు పవన్‌కు తీవ్ర గాయాలు, మిగతా వారి స్వల్ప గాయాలు కావడంతో క్షతగాత్రులను మూడు అంబులెన్స్‌లలో మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ చెర్లపాలెంకు చెందిన గూడెల్లి అరుణ(40)మృతి చెందింది.



గూడెల్లి అరుణ(ఫైల్)

ప్రమాదానికి మూలమలుపే కారణమా..

వరంగల్– ఖమ్మం హైవేపై పెద్ద నాగారం స్టేజీ సమీపంలో ఇటుక బట్టీల వద్ద గతంలో సైతం ప్రమాదాలు జరిగాయి. దీంతో ప్రమాదాలకు మూలమలుపే కారణమని, మూలమలుపు వద్ద లారీ అతివేగంతో నియంత్రణ కోల్పోయి వెనుకనుంచి కూలీల ఆటోను ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

ఉలిక్కిపడ్డ చర్లపాలెం..

మిరపతోటలను ఏరడానికి వెళ్తున్న కూలీల ఆటో ప్రమాదానికి గురికావడంతో చెర్లపాలెం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. కూలీల బంధువులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. ఎస్సై సురేష్ ఘటన స్థలాన్ని సందర్శించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటోడ్రైవర్ అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం

కూలీల ఆటో పెద్దనాగారం సమీపంలోని మూలమలుపు వద్దకు రాగానే లారీ ఒక్కసారిగా ఆటోవైపు దూసుకొచ్చింది.. అంతా లారీ కింద పడిపోయామని భావించగా.. ఆటో నడుపుతున్న దర్మారపు పవన్ అప్రమత్తమై.. పక్కనే ఉన్న చెట్లపొదల్లోకి ఆటోను తిప్పాడు. అప్పటికే వేగంతో ఉన్న ఆటో అదుపుతప్పి పొదల్లోని సిమెంట్ దిమ్మెను తగిలి పల్టీ కొట్టింది. లారీ కింద పడి ప్రాణాలు కోల్పోయేకంటే గాయపడడం మేలనే ఉద్దేశంతో ఆటోను రోడ్డు పక్కకు తిప్పనట్టు డ్రైవర్ పవన్ ఏడుస్తూ చెప్పడం అందరిని కంటతడి పెట్టించింది.

ఆస్పత్రిలో ఆర్తనాదాలు..



ప్రమాద బాధితులను పరామర్శిస్తున్న ఝాన్సీరెడ్డి

నెహ్రూసెంటర్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురావడంతో వారి ఆర్తనాదాలతో ఆస్పత్రి మార్మోగింది. చేతులు, కాళ్లు, మెడ, తల ఇలా.. శరీరమంతా గాయాలతో వచ్చిన ప్రమాద బాధితులతో ఆస్పత్రిలో ఎక్కడ చూసినా రక్తం కనిపించింది. బాధితుల్లో ఒకరు మృతి చెందగా మిగిలిన కూలీలు చికిత్స పొందుతున్నారు. బాధితులకు వైద్యం అందుతున్న విధానాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఆర్ఎంఓ డాక్టర్ జగదీశ్వర్, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట్ పర్యవేక్షించారు. కాగా, తీవ్రంగా గాయపడిన గూడెల్లి మంగమ్మ, దర్మారపు సాలమ్మ, దర్మారపు యాకమ్మను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా.. పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ గుగ్గిళ్ల పీరయ్య, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వీరయ్య, గణేష్, తదితరులు గాయపడినవారిని పరామర్శించారు.

పంటను తరలిస్తూ పరలోకాలకు..



రమేష్ (ఫైల్)

దంతాలపల్లి: ఆరుగాలం కష్టం చేసి చేతికొచ్చిన పంటను తరలిస్తూ.. ఓ రైతు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం బొడ్లాడ గ్రామ శివారులో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సింహులపేట మండలం కొమ్ములవంచ గ్రామ శివారు దుబ్బతండాకు చెందిన జాటోత్ రమేష్(35)కు బొడ్లాడ గ్రామ శివారులో వ్యవసాయ భూమి ఉంది. తన చేనులో పండిన మొక్కజొన్న కంకులను ట్రాక్టర్ సాయంతో స్వయంగా ఒక చోటుకు తరలిస్తున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్‌లో పోసిన కంకులను అన్‌లోడ్ చేసిన అనంతరం ట్రాలీ కిందకు దిగలేదు. దీంతో సరిచేసే క్రమంలో ట్రాలీ ఒక్కసారిగా రమేష్‌పై పడడంతో మృతి చెందాడు. మృతుడికి భార్య లీల, ఇద్దరు కుమారులు చేతన్, రంజిత్ ఉన్నారు. లీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై రాజు తెలిపారు.

అప్పుల బాధతో మొక్కజొన్న రైతు ఆత్మహత్య



మధుకృష్ణ (ఫైల్)

వెంకటాపురం (కె): అప్పులబాధతో మొక్కజొన్న రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ములుగు జిల్లా వెంకటాపురం (కె) మండలం బర్లగూడెం పంచాయతీ పరిధి చిరుతపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. చిరుతపల్లి గ్రామానికి చెందిన లుక మధుకృష్ణ (29) అనే రైతు రెండెకరాల్లో బాండ్ మొక్కజొన్న సాగు చేశాడు. చేను దిగుబడి రాక పోవడంతో పెట్టిన పెట్టుబడి రాక రూ.లక్ష మేర అప్పుల పాలయ్యాడు. దీంతో మనస్తాపానికి గురై గురువారం ఉదయం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని వెంటనే వెంకటాపురం వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్ ఎంజీఎంకు తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం చనిపోయాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

ఒకే దేశం, ఒకే ఎన్నిక నష్టమే..

- సంకీర్ణ ప్రభుత్వాలతోనే ప్రజాస్వామ్యానికి రక్షణ
- ప్రముఖ సామాజికవేత్త ప్రొఫెసర్ హరగోపాల్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

కేయూ క్యాంపస్: భిన్నత్వంలో ఏకత్వంతో కూడిన భారతీయ సమాజానికి 'ఒకే దేశం– ఒకే ఎన్నిక' నష్టదాయకమని ప్రముఖ సామాజిక వేత్త హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ హరగోపాల్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం కాకతీయ యూనివర్సిటీ సెనెట్ హాల్‌లో రాజనీతిశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'భారత సమాజంలో సంకీర్ణ ప్రభుత్వాలు ప్రజాస్వామ్యం' అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేశారు. రాజకీయ పార్టీల మేనిఫెస్టోలు ఓటర్లను ఆకర్షించడానికి ఉపయోగపడుతున్నప్పటికీ వాటి అమలులో మాత్రం చిత్తశుద్ధి లోపిస్తోదన్నారు. దేశంలోని విభిన్న జాతులు, కులాలు, మతాలు, బహుళ సంస్కృతి, సంప్రదాయాలతో కలిసిమెలిసి జీవిస్తున్న ప్రజల హక్కులు, ప్రజాస్వామ్యానికి సంకీర్ణ ప్రభుత్వాలతోనే రక్షణ సాధ్యమని ఆయన అన్నారు. నిత్యం ప్రజలు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరిస్తూ.. ప్రజల జీవితాల్లో మెరుగైన మార్పులు తెచ్చి సమాజాన్ని శాస్త్రీయంగా విశ్లేషిస్తూ ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడమే రాజకీయ పార్టీల ప్రధాన కర్తవ్యంగా ఉండాలన్నారు. నేటి రాజకీయ పార్టీలు కార్పొరేట్ శక్తుల ధన ప్రలోభాలకు లోనై ఓటర్లను ప్రభావితం చేయడం ప్రజాస్వామ్య ఉనికికి ప్రమాదకరమన్నారు. 1960 దశకం చివరి నుంచి దేశంలో ప్రభుత్వాల ఏర్పాటులో ప్రాంతీయ పార్టీల ప్రభావం పెరిగిందన్నారు. 1991లో దేశంలో నూతన ఆర్థిక పారిశ్రామిక విధానాలు, గ్లోబలైజేషన్ ప్రభావంతో సమాజంలో మానవీయ సంబంధాలు కనుమరుగై, మార్కెట్ సంబంధాలు పెరిగిపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఉగ్రవాద సంస్థల్లో మార్పు తీసుకొచ్చేందుకు కార్పొరేట్ శక్తులతో ఏర్పడిన అసమాన సమాజాన్ని తొలగించేందుకు మానవీయ శాస్త్రాలు, రాజనీతి శాస్త్ర ప్రాముఖ్యత అవసరమన్నారు. నేటితరం విద్యార్థులు సమాజ అభివృద్ధి కోసం ప్రశ్నించేతత్వాన్ని, ప్రజాస్వామిక లక్షణాలను పెంపొందించుకోవాలని హరగోపాల్ సూచించారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా..

ప్రాంతీయ పార్టీలతో ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వాలు ప్రజలకు జవాబుదారీగా ఉంటాయని గుల్బర్గా యూనివర్సిటీ యాక్టింగ్ వీసీ ప్రొఫెసర్ శ్రీరాములు అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణమైన పాలన అందిస్తేనే ప్రాంతీయ పార్టీల ప్రభుత్వాలు, సంకీర్ణ ప్రభుత్వాలకు మనుగడ ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ సదస్సులో కేయూ రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం, ముంబాయి యూనివర్సిటీ ప్రొఫెసర్ జోష్ జార్జ్, సోషల్ సైన్స్ డీన్ మనోహర్, రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకటయ్య, బీఓఎస్ చైర్మన్ డాక్టర్ గడ్డం కృష్ణ, అధ్యాపకులు సత్యనారాయణ, నాగరాజు, లక్ష్మీనారాయణ, సంజీవ్, భాగ్యమ్మ, లలిత కుమారి, విజయ్, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను రిజిస్ట్రార్ రామచంద్రం ప్రారంభించారు.



ర్యాంప్ వాక్, నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఉత్సాహంగా రూబిజెస్ట్ - 2025

- కేయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహణ
- ఆకట్టుకున్న విద్యార్థినుల ర్యాంప్ వాక్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో రూబిజెస్ట్– 2025లో భాగంగా శుక్రవారం థిమ్ డే వేడుకలను ఉత్సాహంగా కొనసాగాయి. ప్రోగ్రాం కన్వీనర్ సాయి తరుణ్, వివిధ ఆర్గనైజర్ల ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఆడిటోరియంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఆయా ఉత్సవాలను ప్రారంభించారు. ఈ వేడుకల్లో కేరళ సంప్రదాయ దుస్తులు ధరించి మహిళా అధ్యాపకులు చేసిన ర్యాంప్ వాక్ ఆకట్టుకుంది. అంతే కాకుండా వారు ఇచ్చిన సోలో, గ్రూప్ డ్యాన్స్‌లు ఆకర్షణగా నిలిచాయి. జాతీయ స్థాయిలో ఉన్న వివిధ ప్రాంతాల, సంప్రదాయ నత్య రీతులవారు ధరించే దుస్తులను ధరించి కళాశాల విద్యార్థినులు చేసిన ర్యాంప్ వాక్ ఆకట్టుకుంది. వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ర్యాంప్ వాక్ ప్రదర్శనలో నిలిచిన బీటెక్ ఈసీఈ విభాగం ప్రథమ సంవత్సరం విద్యార్థిని సుదూష్తికి ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రెడ్డి బహుమతి అందజేశారు.

పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలి

- జీఎం అరుణ్‌కుమార్ జైన్



వరంగల్ రైల్వేస్టేషన్‌లో కొనసాగుతున్న పనులను పరిశీలిస్తున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్

ఖిలా వరంగల్: అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద కొనసాగుతున్న వరంగల్ రైల్వేస్టేషన్ పునరుద్ధరణ పనులను శరవేగంగా పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం వరంగల్ రైల్వేస్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ (ఏబీఎస్ఎస్) కింద రూ.25.41కోట్లలో జరుగుతున్న పాదచారుల వంతెన(ఫుట్ ఓవర్ బ్రిడ్జి), 3 లిఫ్టులు, 4 ఎస్కలేటర్లు, లిఫ్టులు, గ్రీనరీ పనులను పరిశీలించారు. అంతకు ముందుగా రైల్వే కోచ్ రెస్టారెంట్‌ను తిలకించారు. అనంతరం జీర్పీ పోలీసులకు నూతన భవనం నిర్మించాలని జీఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఎం భరతేష్‌కుమార్, సీనియర్ డీసీఎం బాలాజీ కిరణ్, స్టేషన్ మేనేజర్ బాలరాజ్‌నాయక్, సీసీఐ రాజగోపాల్, ఆర్పీఎఫ్ సీఐ సీఎస్ ఆర్ కృష్ణ, జీర్పీ సీఐ సురేందర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో 'హైపర్' సేవలు

- ప్రకృతి వైపరీత్యాల సమయంలో తక్షణం విద్యుత్ సరఫరా పునరుద్ధరణ
- ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్

జనగామ: ప్రకృతి వైపరీత్యాలతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన సమయంలో తక్కువ సమయంలో పునరుద్ధరించేందుకు 'హైపర్' సేవలను అందుబాటులోకి తెచ్చామని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ టి.వేణుమాధవ్ తెలిపారు. శుక్రవారం సర్కిల్ ఆఫీసులో ఆయన మాట్లాడుతూ.. భారీ వర్షాలు, ఈదురు గాలులతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే పునరుద్ధరణకు కొంత సమయం పట్టేదని, హైపర్ సేవలతో తక్షణమే స్పందించేలా కార్యాచరణ రూపొందించామన్నారు. హెచ్–హెడ్ క్వార్టర్‌లో అప్రమత్తత, ఏ–సిబ్బంది, సామగ్రి సమీకరణ, ఐ–సమాచార సేకరణ, ట్రాన్స్‌పోర్టింగ్, పి–పటిష్ట వ్యూహం అమలు, ఈ–నిర్దిష్ట కార్యాచరణ అమలు, ఆర్–విద్యుత్ సరఫరా పునరుద్ధరణ 'హైపర్' లక్ష్యమని చెప్పారు. ఎన్పీ డీసీఎల్ శాఖలో కొత్తగా అమలు చేయనున్న ఈ సేవలను అంకిత భావంతో నిర్వహించేందుకు ప్రతీ ఉద్యోగి కృతనిశ్చయంతో ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రతీ హెడ్ క్వార్టర్‌లో ఓ ఉద్యోగి 24 గంటల పాటు అందుబాటులో ఉండి అత్యవసర మెటీరియల్, సిబ్బందిని పంపించి విద్యుత్ పునరుద్ధరణ చర్యల్లో జాప్యం కాకుండా చూసే బాధ్యత అతడిపై ఉంటుందన్నారు.


వంటల్లో నూనె తగ్గించండి

బాల్యంలోనే ఊబకాయం సమస్య

- విద్యార్థుల్లో ఆరోగ్య అలవాట్లు పెంపొందించాలి
- న్యూట్రిషన్ గార్డెన్ కూరగాయలు వాడాలి
- కేంద్రం ఉత్తర్వులు.. డీఈఓలకు ఆదేశాలు

జనగామ: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఆరోగ్యంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. చిన్న తనంలోనే ఊబకాయం, జీర్ణకోశ సంబంధిత సమస్యలు, గుండె జబ్బుల బారిన పడుతుండంతో మధ్యాహ్న భోజనం తయారీలో స్వల్ప మార్పులు తీసుకువస్తూ రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. రోజువారీగా మధ్యాహ్న భోజనంలో కూరల్లో 10 శాతం వంట నూనె తగ్గించాలని పేర్కొనడంతో పాటు.. ఆరోగ్యకరమైన పలు సూచనలు చేసింది.

బాల్యంలోనే ఆరోగ్య సమస్యలు



బాల్యంలోనే ఊబకాయం సమస్య తీవ్రమవుతున్న నేపథ్యంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ‘పరీక్షా పే చర్చా–2025, మన్ కీ బాత్’ కార్యక్రమాల్లో ఆందోళన వ్యక్తం చేశారు. 1990 సంవత్సరంలో అధిక బరువుతో 0.4 మిలియన్ల ప్రజలు ఉండగా.. ప్రస్తుతం 15 నుంచి 19 ఏళ్ల వయసు మధ్య 12.5 మిలియన్లకు చేరుకుందని లాన్సెట్ జర్నల్ లెక్కల ప్రకారం నివేదించారు. ఇందులో అమ్మాయిల కంటే అబ్బాయిలే అధికంగా ఉన్నారని అందులో పేర్కొన్నారు. జీవన శైలి, ఆహార అలవాట్లలో మార్పులు రావడంతో అనేక రోగాల బారిన పడుతున్నారని గుర్తించారు. దీంతో బడిలో వడ్డించే మధ్యాహ్న భోజనంలో 10 శాతం వంట నూనె వినియోగాన్ని తగ్గించడంతో పాటు ఆచరణాత్మక సలహాలను సూచిస్తూ రాష్ట్రాలకు జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. వంట నూనె వినియోగంపై ఎస్ఎంసీల ఆధ్వర్యాన ప్రత్యేక సమావేశాలు, డిబేట్లు, వ్యాసరచన పోటీల ద్వారా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవగాహన కల్పించాలి. అలాగే కుక్, హెల్పర్లకు శిక్షణ ఇవ్వాలి. అదనపు కేలరీలను ఖర్చు చేయడానికి విద్యార్థులకు వ్యాయామం, యోగా ప్రాముఖ్యతను వివరించాలి. నూనెతో డీప్ ఫ్రై చేయడానికి బదులు గ్రిల్లింగ్, స్టీమింగ్, బేకింగ్ వంటి ఆరోగ్యకరమైన వంట పద్ధతులను అవలంబిస్తే మేలని కేంద్రం సూచించింది.

ఆహారపు అలవాట్లపై పోటీలు..

ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై పాఠశాల స్థాయి క్విజ్, వ్యాసరచన, ఏకో క్లబ్ కార్యకలాపాలు, సమూహంగా చర్చలు, తదితర పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించాలి. వ్యాయామం, యోగా ప్రాముఖ్యతను వివరిస్తూ.. విద్యార్థులు ఆరోగ్యకరమైన జీవనశైలిని పొందే విధంగా ఉపాధ్యాయులు చొరవ చూపించాలి. ప్రతి విద్యార్థి శారీరక శ్రమను పెంచేందుకు తల్లిదండ్రులకు మార్గనిర్దేశం చేస్తూ శిక్షణ ఇవ్వాలి. ఇంట్లోనూ తక్కువ నూనె వాడకాన్ని ప్రోత్సహించేలా సోషల్ మీడియాలో చిత్రాల ద్వారా ప్రచారం చేపట్టాలి. 10శాతం తగ్గించిన నూనెతో కూడిన ఆహార పదార్థాలను అందించేందుకు పాఠశాల క్యాంటీన్లను ప్రోత్సహించాలని ఉత్వర్వుల్లో పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను మరింత బలోపేతం చేసేందుకు విద్యార్థులు, తల్లిదండ్రులను భాగస్వామ్యం చేస్తూ పాఠశాల నిర్వహణ కమిటీల ఆధ్వర్యాన సమావేశాలు నిర్వహించాలి.

అధిక నూనెతో అనర్థాలు

అధిక నూనె వినియోగంతో ఊబకాయం, గుండె జబ్బు, జీర్ణ సమస్యలు వస్తున్నాయి. విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడంతో పాటు తక్కువ నూనెతో తాజా, పోషకమైన భోజనం తయారు చేసి వడ్డించేలా చూడాలి. విద్యార్థులకు అందించే ఫోర్టిఫైడ్ ఎడిబుల్ ఆయిల్‌లో విటమిన్ ఏ, డీ సమృద్ధిగా ఉంటుందని గమనించాలి. అలాగే పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన న్యూట్రిషన్ గార్డెన్ కూరగాయలను వినియోగించడం ద్వారా విద్యార్థులు గార్డెన్‌లో చురుగ్గా పాల్గొనడంతో పాటు పౌష్టికాహారంపై అవగాహన, ప్రకృతితో కనెక్టివిటీ పెరుగుతుంది. తక్కువ నూనె ఆహారంపై హోమ్ సైన్స్ కళాశాల, వైద్యులు, పోషకాహార నిపుణులచే తరగతి గదిలో సెమినార్లు నిర్వహించాలి.

సీఎస్ఆర్డీలో ఎన్పీడీసీఎల్‌కు 'ఎ' రేటింగ్

హన్మకొండ: కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ విడుదల చేసిన కన్స్యూమర్ సర్వీసింగ్ రేటింగ్ ఆఫ్ డిస్కమ్స్ (సీఎస్ఆర్డీ)లో నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (టీజీ ఎన్పీడీసీ ఎల్) జాతీయ స్థాయిలో 'ఎ' రేటింగ్‌తో కేటగిరిలో 5వ స్థానంలో నిలిచింది. విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందిస్తూ, త్వరగా సర్వీస్‌ల మంజూరు, ఇతర సేవలు, మీటరింగ్, బిల్లింగ్ ప్రక్రియ వేగంగా నిర్వహించడం, ఫిర్యాదుల పరిష్కారంలో జవాబుదారీతనం, కార్యాచరణలో ముందుండడం ద్వారా దేశంలోని అన్ని డిస్కమ్‌లలో ఎన్పీడీసీఎల్ ఐదో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్పీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందిస్తున్నామన్నారు. అర్బన్ ప్రాంతంలో 23.57 గంటలు, రూరల్ ప్రాంతంలో 22.48 గంటలు సరఫరా అందిస్తున్నామని వివరించారు. జాతీయ సగటుతో పోల్చుకుంటే అర్బన్‌లో 23.30 గంటలు, రూరల్‌లో 21.34 గంటలతో నేరుగా ఆన్‌లైన్ ద్వారా 100 శాతం దరఖాస్తుల ప్రక్రియ చేపట్టడం, బిల్లింగ్ జారీని 100 శాతం పూర్తి చేసినందుకు ఈ ర్యాంకు వచ్చిందన్నారు.